సాక్షి
ప్రకాశం

ఆదివారం । 3 । నవంబర్ । 2024



డిప్యుటేషన్ల పేరుతో డ్యూటీకి డుమ్మా

పశువైద్య శాఖలో డిప్యుటేషన్ల పేరుతో విధులకు గైర్హాజరవుతున్నారు కొందరు అధికారులు. పని చేయకుండానే అప్పనంగా ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్నారు.

- 8లో..



టీడీపీ సర్పంచ్ దందా

పొదిలి మండలం కొండాయపాలెం టీడీపీ సర్పంచ్ ప్రభుత్వ భవనాల నిర్మాణ బిల్లుల నగదు కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా స్వాహా చేసి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

డెంగీ, మలేరియాపై అప్రమత్తం చేయాలి



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు టౌన్: సీజనల్‌గా వ్యాపించే డెంగీ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని నేషనల్ వెక్టార్ బోర్న్ డిసీజెస్ రాష్ట్ర కన్సల్టెంట్ ఈ.కొండారెడ్డి అన్నారు. జిల్లాలో ఆయన పలు ప్రాంతాలను పరిశీలించారు. గద్దలగుంట, దారావారి తోట సచివాలయం పరిధిలోని ఇందిరా కాలనీని సందర్శించి డ్రై డేలో పాల్గొన్నారు. వైద్యశాలలో ల్యాబ్‌ను పరిశీలించి తగిన సూచనలు చేశారు. డెంగీ, మలేరియా కేసుల నివారణకు బాధ్యతతో పనిచేయాలని చెప్పారు. స్థానిక సంస్థలతో కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లా మలేరియా అధికారి శ్రావణ్ కుమార్, సబ్ యూనిట్ అధికారులు వెంకట రెడ్డి, సాగర్, శ్రీనివాసులు, భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో జీవన ప్రమాణాలు మెరుగు

- డీఆర్‌డీఏ పీడీ వసుంధర

ఒంగోలు అర్బన్: ప్రాథమిక అక్షరాస్యతతో పాటు డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతతో జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని డీఆర్‌డీఏ పీడీ వసుంధర అన్నారు. గ్రీవెన్స్ హాలులో శనివారం వయోజన విద్యా సంచాలకుడు పీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఉల్లాస్ అక్షరాస్యతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ పీడీ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ కనీస చదువు ఉండాలని, అప్పుడే కుటుంబం తద్వారా సమాజం అన్నివిధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. కేరళలో నూరు శాతం అక్షరాస్యత ఉన్నట్లు ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం ద్వారా జిల్లాలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, రిసోర్స్ పర్సన్స్ మనోజ్‌బాబు, సురేఖ, సుబ్బారావు, ఆదిశేషు వయోజన విద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి



ధర్నా చేస్తున్న పారిశుధ్య విభాగానికి చెందిన మేస్త్రీలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థలోని పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలపై రాజకీయ వేధింపులు ఆపాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఒంగోలు నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నగర పాలక సంస్థ కార్యాలయం ముందు యూనియన్ నాయకులు, మేస్త్రీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు కందుల ఆదినారాయణ మాట్లాడుతూ ఒంగోలు నగర పాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో మేస్త్రీలుగా పనిచేస్తున్న వారిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులకు గురిచేసి కావాలని మేస్త్రీలను విధుల నుంచి తప్పించారన్నారు. కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేస్త్రీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కూడా కోరారు. అక్టోబర్ నెల మస్టర్‌తో వేతనాలు ఇవ్వాలన్నారు. నగర పాలక సంస్థ పాలక మండలి జోక్యం చేసుకోవాలని, నగర కమిషనర్ చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిలువరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

పశుగణనను పరిశీలించిన జేడీ



పశుగణనను పరిశీలిస్తున్న జేడీ బేబీరాణి

నాగులుప్పలపాడు: అఖిల భారత 21వ జాతీయ పశుగణన సర్వేలో ప్రతి రైతుకు ఉన్న పశువులను పరిగణలోకి తీసుకోవాలని పశుసంవర్థకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డా.బేబీరాణి సూచించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పశుగణనలో భాగంగా శనివారం మండలంలోని ఉప్పుగుండూరు, చదలవాడ గ్రామాల్లో జరుగుతున్న పశుగణన సర్వేను జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశుగణన చేస్తున్న సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు జాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితం అంతా గ్యాస్



ఉచిత గ్యాస్ పథకం అంతా ఫార్సుగా మారింది. సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామంటూ ఎన్డీయే కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక మాట మార్చింది. దీపం 2.0 పథకంలో గ్యాస్ ఉచితం అందరికీ కాదు కొందరికే అంటోంది. దీపం పథకం లబ్ధిదారులతోపాటు, రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే ఇస్తామంటూ కొర్రీలు పెట్టింది. పక్కాగా 2,25,638 మంది మాత్రమే లబ్ధిదారులుగా తేలారు. ఇంకా 4.31 లక్షల మందికి సంబంధించి గందరగోళంగానే ఉంది. ఈకేవైసీ చేయించుకుంటే రేషన్ కార్డులు ఉన్న వారు ఎంతమంది అనేది స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇక ఈకేవైసీ చేయించుకునేందుకు లబ్ధిదారులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు.

- దీపం 2.0 అందరికీ కాదు కొందరికే
- జిల్లాలో 6,56,738 మంది గ్యాస్ వినియోగదారులు
- వారిలో 2,25,638 మంది పక్కా లబ్ధిదారులు
- గందరగోళంగా 4.31 లక్షల మంది లబ్ధిదారులు
- వాస్తవానికి భిన్నంగా 4.80 లక్షల మంది లబ్ధిదారులు అంటూ ప్రకటనలు
- ఈకేవైసీ నమోదు కోసం తిప్పలు పడుతున్న వినియోగదారులు

ఒంగోలు అర్బన్:

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం పథకం ద్వారా అందరికీ కాకుండా కొందరికే పరిమితం చేసింది కూటమి సర్కార్. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికీ మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు కండీషన్స్ అప్లై అంటున్నారు. దీంతో గ్యాస్ వినియోగదారులందరికీ ఉచిత గ్యాస్ లభించే పరిస్థితి లేదు. గ్యాస్ కనెక్షన్ యాక్టివ్‌లో ఉండి బియ్యం కార్డు ఉన్న వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. అయితే లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకుంటే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందే పరిస్థితి. అది కూడా గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన తర్వాత సిలిండర్ తీసుకునే సమయంలో వినియోగదారులు ముందుగా డబ్బులు చెల్లించాలి. రెండు రోజుల్లో తిరిగి ఆ నగదు వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో జమవుతుంది. ఒక వేళ బ్యాంకు ఖాతా ఫోన్ నంబర్, బియ్యం కార్డు ఫోన్ నంబర్ తేడాగా ఉంటే ఇబ్బందులు తప్పవు. ఇచ్చే ఉచితం నేరుగా ఇవ్వాలి కానీ ముందు డబ్బు చెల్లించి ఆ తర్వాత బ్యాంకు ఖాతాకు జమ చేయడం ఏంటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 6,56,738 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. అందులో దీపం పథకం కింద కేవలం 1,61,626 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. సీఎస్ఆర్ కనెక్షన్‌లు 38,517, ఉజ్వల పథకం కింద 16,755, పీఎంయూవై కింద 8740 గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటన్నింటితో కలిపి పక్కాగా 2,25,638 మంది లబ్ధిదారులు ఉంటారు. అయితే మిగిలిన 4,31,100 మందిలో రేషన్ కార్డుదారులు ఎంత మంది ఉన్నారో తెలీడంలేదు. తాజా నిబంధనల ప్రకారం ఈకేవైసీ చేయించుకుంటే అర్హులు ఎంతమంది అనేది స్పష్టత వస్తుందని తెలుస్తోంది. వాస్తవం ఇలా ఉండగా దీపం 2.0 పథకం ప్రారంభం సందర్భంగా జిల్లాలో 4,80,711 మంది లబ్ధిదారులు ఉన్నట్టు చెబుతున్నారు. ఈ విధంగా చూసుకున్నా సుమారు 1.76 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్‌లు దక్కే అవకాశం కనిపించడంలేదు. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికీ ఉచిత గ్యాస్ అని డప్పు కొట్టి ఇప్పుడు షరతులు పెట్టడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ఈకేవైసీ అయితే తప్ప నిజమైన అర్హులు ఎంతమంది అన్నది తేలే పరిస్థితి కనిపించడం లేదు.

రూ.200 చెల్లించి గ్యాస్ పైపు తీసుకుంటేనే..

జిల్లాలో మొత్తం 49 గ్యాస్ ఏజెన్సీల ద్వారా వినియోగదారులకు సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. వాటిలో ఐఓసీఎల్ కంపెనీకి సంబంధించి 26 ఏజెన్సీలు, హెచ్‌పీసీఎల్ 10 ఏజెన్సీలు, బీపీసీఎల్ 13 ఏజెన్సీలు ఉన్నాయి. ఉచిత గ్యాస్ పొందేందుకు వినియోగదారులు రేషన్ కార్డుతో గ్యాస్ ఏజెన్సీల్లో ఈకేవైసీ చేయించుకోవాలి. దీన్ని అవకాశంగా భావించిన గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు బలవంతంగా రెగ్యులేటర్ పైపును అంటకడుతూ వ్యాపారం చేస్తున్నారు. రూ.200 చెల్లించి తప్పనిసరిగా పైపు తీసుకోవాలని లేకుంటే ఈకేవైసీ చేయమని వినియోగదారులపై ఒత్తిడి తీసుకురావడం గమనార్హం. సిలిండర్ పైప్ బాగుందని ఇప్పుడు అవసరం లేదని చెప్పినా ఏజెన్సీలు మాత్రం రూ.200 చెల్లించి పైప్ తీసుకోవాలని డిమాండ్ చేయడంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఏజెన్సీల ఒత్తిడి ప్రజలపై లేకుండా చూడాలని కోరుతున్నారు.

బియ్యం కార్డు ఉన్న గ్యాస్ వినియోగదారుల వివరాలు మావద్ద లేవు

గ్యాస్ వినియోగదారులకు సంబంధించి బియ్యం కార్డు ఉన్న వినియోగదారులు ఎంతమంది ఉంటారని డీఎస్‌ఓ పద్మశ్రీని అడుగగా అటువంటి వివరాలు మావద్ద ఉండవని, కేవలం గ్యాస్ వినియోగదారులు ఎంతమంది, బియ్యం కార్డుదారులు ఎంతమంది ఉంటారో తెలపగలమే తప్ప గ్యాస్ వినియోగదారుల్లో బియ్యం కార్డు ఉన్న వారి వివరాలు పూర్తిగా నమోదు కానందున మావద్ద ఉండవని స్పష్టం చేశారు.

– పద్మశ్రీ, జిల్లా పౌరసరఫరాల అధికారి

బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్లు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

చీమకుర్తి: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రకాశం జిల్లా జట్లను శనివారం చీమకుర్తిలో ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–14, 17 విభాగాలలో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. అండర్–14కు ఎంపికైన బాలబాలికల జట్లకు ఈ నెల 6, 7 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో అండర్–17 జట్లకు త్వరలో రాజమండ్రిలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని స్కూలు గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ హాజీరా బేగం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని వెల్లంపల్లి రంగారావు ఏర్పాటు చేయటంతో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ తరపున అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పీడీ డీ స్వరూపావాణి, జిల్లాలోని పలు ప్రాంతాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ హాజీరాబేగం

కనిగిరిలో విస్తరణం

- అధికారులు, వ్యాపారులు, గృహ నిర్మాణదారుల మధ్య వాగ్వాదం
- తొలి రోజు మెట్లు, తాత్కాలిక నిర్మాణాల తొలగింపు
- నేడు పూర్తిగా అక్రమ శాశ్వత కట్టడాలు తొలగిస్తామన్న అధికారులు



రోడ్ల విస్తరణ చేపడుతున్న మున్సిపల్ అధికారులు

కనిగిరి రూరల్: మున్సిపాలిటీలోని స్థానిక బొడ్డుచావిడి సెంటర్ రోడ్డులో శనివారం మున్సిపల్ అధికారులు పోలీసుల బందోబస్తుతో రోడ్ల విస్తరణ ప్రారంభించారు. అయితే.. ఈ ప్రక్రియలో కనీస సమాచారం ఇవ్వకుండా.. ఎంత వరకు తొలగిస్తారో ముందస్తుగా తెలపకుండా.. ఒక్క సారిగా రెండు పొక్‌లెన్ వాహనాలు పెట్టి కట్టడాలు తొలగించడాన్ని గృహ యజమానులు, స్థానిక వ్యాపారులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో టీపీఎస్ సువర్ణకుమార్‌కు, వ్యాపారులకు మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పోలీస్ బందోబస్తు నడుమ కొంతమేర కట్టడాలను తొలగించారు.

తొలి రోజు..
కాలువలపై కట్టడాల తొలగింపు:

వాస్తవానికి కొంతకాలంగా కనిగిరి మున్సిపల్ ఆఫీసు వద్ద నుంచి బొడ్డు చావిడి, నాజ్ సెంటర్ వరకు రోడ్డు విస్తరణ ప్రక్రియ చేపడతారని ప్రచారం సాగుతోంది. ఈమేరకు పలుమార్లు గత టీపీఎస్, సచివాలయ, మున్సిపల్ అధికారులు సర్వేలు నిర్వహించారు. స్ట్రీట్ ప్లాన్ సర్వే రికార్డు ప్రకారం కొలతలు కూడా తీస్తున్నామంటూ హడావుడి చేశారు. అయితే రోడ్ల విస్తరణపై మున్సిపల్ అధికారులు కనీస బహిరంగ ప్రకటనలు చేయలేదు. నిర్మాణదారులు నోటీసులు కూడా ఇవ్వలేదు. పాత స్ట్రీట్ మ్యాప్ సర్వే రికార్డు ప్రకారం ఆరోడ్డు 35, 40 అడుగులు ఉందంటూ.. మున్సిపల్ అధికారులు వారి అనుకూల మీడియాలకు లీకులు ఇచ్చి ప్రచారం చేశారు. దీనిపై మిగతా మీడియా ఎవరైనా మున్సిపల్ అధికారులను అడిగితే పాత రికార్డు, పాత స్ట్రీట్ సర్వే రికార్డు ప్రకారం విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెబుతున్నారు. రికార్డులు తమ వద్ద లేవని, కలెక్టరేట్‌లో ఉన్నాయని, రెవెన్యూలో ఉన్నాయని ముక్తసరిగా చెప్పి తప్పించుకుంటూ వచ్చారు.

ఒక్కసారిగా ఎందుకు ప్రారంభించారు..?

దీనిపై కొంత కాలంగా స్తబ్దుగా ఉన్న మున్సిపల్ అధికారులు ఒక్కసారిగా శనివారం మళ్లీ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అసలు ఏ ప్రక్రియ ప్రకారం చేపడుతున్నారో.. ఎంత వరకు కట్టడాలు తొలగిస్తారో తెలియని పరిస్థితి. మున్సిపల్ ఆఫీసు నుంచి నాజ్ సెంటర్ వరకు దాదాపు అన్నీ శాశ్వత కట్టడాలే. పొక్‌లెన్ వాహన తొండం తగిలితే భవనం అంతా పూర్తిగా కూలిపోయే పరిస్థితి. దీంతో వ్యాపారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. నోటీసు లిస్తే కోర్టులకు వెళ్లే అవకాశం ఉన్నందునే చెప్పకుండా తొలగింపు చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కొంతమంది అధికారులు వెల్లడిస్తున్నారు. ఏది ఏమైనా తొలి రోజు కాలువలపై నిర్మించిన మెట్లను తొలగించి.. ఆ తర్వాత నిర్మాణంలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగిస్తారని చర్చ నడుస్తోంది.

ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం

పాతస్ట్రీట్ లైన్, రెవెన్యూ రికార్డుల ప్రకారం అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. రికార్డుల ప్రకారం మున్సిపల్ ఆఫీసు నుంచి బొడ్డు చావిడి సెంటర్ వరకు రోడ్డు వెడల్పు 60 అడుగులు ఉండాలి. బొడ్డు చావిడి సెంటర్ జంక్షన్, దానికి మూడు పక్కల రోడ్డు 40 అడుగుల వెడల్పు ఉండాలి. దీని ప్రకారం బొడ్డు చావిడి సెంటర్ నుంచి నాజ్ సెంటర్ వైపు రోడ్డులోనే ఎక్కువగా ఆక్రమణలు ఉన్నాయి. దీంతో వారికి చాలా రోజుల నుంచి చెప్పినా వినకపోవడంతో ఆక్రమణల తొలగింపు చర్యలు ప్రారంభించారు. అన్ని రోడ్ల విస్తరణలు చేపట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా పరిష్కరిస్తాం. ఆక్రమణదారులకు గతంలో సమాచారం ఇచ్చాం .. వారు స్పందించక పోవడంతో చర్యలు చేపట్టాం. తొలిరోజులో తాత్కాలిక కట్టడాలు, రేకుల షెడ్లు, మెట్లు తొలగించాం. వ్యాపారులు, గృహ నిర్మాణదారులు శనివారం రాత్రి కమిషనర్‌ను, తనను వచ్చి కలిశారు. వారితో సమస్యను వివరించాం. బొడ్డు చావిడి సెంటర్ నుంచి నాజ్ సెంటర్ వరకు కనీసం 30 అడుగుల రోడ్డు విస్తరణకు అంగీకరించి, సహకరించాలని చెప్పాం. ఈమేరకు ఆదివారం పూర్తి స్థాయిలో ఆక్రమణ తొలగింపు చర్యలు చేపడతాం.

– సువర్ణ కుమార్, టీపీఎస్





బొడ్డు చావిడి సెంటర్‌లో ఆక్రమణలు కూలుస్తున్న జేసీబీ



అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

● శుభ కార్తీకం



ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పవిత్రమైన కార్తీక మాసం ఆరంభమైంది. ఈ సందర్భంగా శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శైవక్షేత్రాల్లో శివునికి అభిషేకాలు చేశారు. ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.



మార్కాపురంలోని శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

- గొట్లగట్టులో జిల్లా స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

కొనకనమిట్ల: పాఠశాల విద్యార్థులు క్రీడల్లో పాల్గొనటం ద్వారా వారికి మానసిక ఉల్లాసం కలుగుతుందని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ఐ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రగ్బీ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన రగ్బీ క్రీడాకారులను పరిచయం చేసుకుని హెచ్ఎం విజయలక్ష్మి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో మార్కాపురం, గొట్లగట్టు, అర్ధవీడు, కురిచేడు, బొద్దుకూరపాడు, తుమ్మలచెరువు, వెలిగొండ, చింతలపాలెం, వాడరేవు ప్రభుత్వ పాఠశాలల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పాఠశాల పీడీ, రగ్బీ క్రీడాకోచ్ వై.బాలగురవయ్య పర్యవేక్షణలో మంచి ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ సత్తాచాటారు. పలువురు క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం విజయలక్ష్మి, పీడీ బాలగురవయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీఈటీలు పెద్దన్న, చంద్రశేఖరరావు, రాజశేఖర్, అచ్చయ్య, వెంకటేశ్వర్లు, రవి ప్రసాద్‌రెడ్డి, శ్రీదేవి, క్రీడాకారులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, పీఈటీలు

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

తర్లుపాడు: తర్లుపాడు – మార్కాపురం రైల్వేస్టేషన్ల మధ్యలో సుమారు 45 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి శనివారం ఉదయం గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తర్లుపాడు రైల్వేస్టేషన్ మాస్టర్ వెంటనే నంద్యాల ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు ప్యాంటు ధరించి నలుపురంగు గడ్డంతో 5.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. అతని వివరాలు తెలిసినవారు సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, నంద్యాల (9440627653) వారిని సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


మృతి చెందిన రైతు ఈశ్వరరెడ్డి

కంభం: కారు ఢీకొని ద్విచక్రవాహనదారుడైన రైతు మృతిచెందిన సంఘటన శనివారం అనంతపురం–అమరావతి హైవేపై జరిగింది. కంభం మండలంలోని కందులాపురం గ్రామానికి చెందిన చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి (65) అనే రైతు జంగంగుంట్ల సమీపంలో ఉన్న తన పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. కందులాపురం అడ్డరోడ్డు సమీపంలో కంభం నుంచి మార్కాపురం వైపు వెళ్లే ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఈశ్వరరెడ్డికి తీవ్రగాయాలవగా కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందడంతో మృతదేహాన్ని తిరిగి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కంభం ఎస్సై నరసింహారావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వీఆర్వో అవినీతిపై పోరాడిన వ్యక్తి నిర్బంధం

- విడిపించిన పోలీసులు


కొండలరావు

మద్దిపూడి: వీఆర్వో అవినీతిపై పోరాడి సస్పెండ్ చేయించిన వ్యక్తిని ఆ కోపంతో నిర్బంధించగా, పోలీసులు జోక్యం చేసుకుని విడిపించారు. మద్దిపూడి మండలం జగ్గరాజుపాలెంలో శనివారం జరిగిన ఈ సంఘటన వివరాల్లోకెళ్తే.. జరుగుమల్లి మండలం పిితాపురం గ్రామానికి చెందిన కొండలరావు చీమకుర్తి మండలంలో పనిచేస్తూ అవినీతికి పాల్పడిన వీఆర్వోపై చట్టపరమైన పోరాటం చేయడంతో రెవెన్యూ అధికారులు సస్పెండ్ చేశారు. ఆ వీఆర్వో బంధువైన మద్దిపూడి మండలంలోని పెట్రోల్‌బంక్ యజమాని శనివారం కొండలరావును నిర్బంధించాడు. ఈ విషయం తెలుసుకున్న మద్దిపూడి పోలీసులు పెట్రోల్ బంక్ యజమానిని ప్రశ్నించగా, తన బంకులో పెట్రోల్ కొట్టించుకుని డబ్బులు ఇవ్వలేదని, అందుకే నిర్బంధించానని పోలీసులకు తప్పుడు సమాచారం అందజేశారు. పోలీసులు కొండలరావుతో మాట్లాడగా పెట్రోల్ డబ్బులు ఫోన్ పే ద్వారా చెల్లించిన విషయాన్ని వాట్సాప్ ద్వారా తెలియజేశాడు. దీంతో ఎస్‌ఐ రమేష్‌బాబు తమ సిబ్బందిని పంపించి కొండలరావును విడిపించారు. నిర్బంధించడం చట్టవ్యతిరేకమైన చర్య అని, ఏదైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని, విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేష్‌బాబు స్పష్టం చేశారు.

గుండ్లకమ్మలో దూకిన విద్యార్థి

అద్దంకి రూరల్: గుండ్లకమ్మ నదిలో విద్యార్థి దూకిన సంఘటన శనివారం సాయంత్రం అద్దంకిలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ కృష్ణయ్య.. ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అద్దంకిలోని గరటయ్యకాలనీ 19వ లైన్‌లో నివాసం ఉంటున్న దాట్ల శ్రీను కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇద్దరు కుమారులు కాగా.. చిన్నవాడైన దుర్గా ప్రసాద్ (18) స్థానిక విశ్వభారతి కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం తిమ్మాయపాలెంలో ఉన్న స్నేహితుడు డబ్బులు ఇస్తానన్నాడని, తీసుకువస్తానని, తోడురమ్మని అన్నతోపాటు బైకుపై బయలుదేరి వెళ్లాడు. మార్గం మధ్యలో గుండ్లకమ్మ నదిపై ఉన్న బ్రిడ్జివద్దకు రాగానే డబ్బులు కిందపడ్డాయని చెప్పి అన్నను బైకు ఆపమన్నాడు. బైకు ఆపగానే అకస్మాత్తుగా పరుగెత్తుకుంటూ వెళ్లి బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకాడు. నదిలో కొట్టుకుపోతూ కొంతసేపు కనిపించి ఆ తర్వాత మునిగిపోయాడు. సీఐ, ఎస్సైలు ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు.

డిప్యుటేషన్ల పేరుతో.. డ్యూటీకి డుమ్మా..!

- పశువైద్యశాఖలో డిప్యుటేషన్ల మాయ
- విజయవాడలో ఉంటూ కురిచేడులో ఉద్యోగం
- పశువైద్యం అందక మూగజీవాల రోదన

కురిచేడు:

పశువైద్యశాఖలో డిప్యుటేషన్ల పేరుతో విధులకు గైర్హాజరవుతున్నారు కొందరు అధికారులు. పనిచేయకుండానే అప్పనంగా నెలనెలా ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్నారు. వ్యక్తిగత పనులు చూసుకుంటూ హోదాని ఎంజాయ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకుండా లాలూచీ పడుతుండటంతో పశువైద్యశాఖలో డిప్యుటేషన్ల మాయాజాలం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఫలితంగా గ్రామాల్లో పశువులు, జీవాలకు వైద్యం అందక విలవిల్లాడుతున్నాయి. వాటి పోషకులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కాకుండా ఉన్నాయి.

జిల్లాలో తెల్లపశువులు 56,332, నల్ల పశువులు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589, కోళ్లు 8,33,434 కలిపి మొత్తం 35,46,289 ఉన్నాయి. వీటికి వైద్యసేవలు అందించేందుకు జిల్లావ్యాప్తంగా 84 పశువైద్యశాలలు, 55 గ్రామీణ పశువైద్యశాలలతో పాటు 18 మంది అసిస్టెంటు డైరెక్టర్ స్థాయి అధికారులు కలిగిన ఏరియా పశువైద్యశాలలు ఉన్నాయి. వాటిలో ఎక్కువ మంది డిప్యుటేషన్లపై వచ్చిన వారే ఉన్నారు. వారి అనుకూలతలను బట్టి ఆస్పత్రికి వచ్చిపోతుంటారేగానీ.. ప్రతిరోజూ విధులకు హాజరుకారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడీ స్థాయి అధికారులు కొందరు తమకు బదిలీ అయిన స్థానాలకు వెళ్లకుండా వారికి ఇష్టమొచ్చిన స్థానానికి డిప్యుటేషన్ వేయించుకుని డ్యూటీలకు డుమ్మాకొడుతున్నారు. దీంతో పశువులకు మెరుగైన వైద్యం అందక జిల్లాలో మూగజీవాలు అరణ్యరోదన అనుభవిస్తున్నాయి. ప్రమాదకరమైన ఎల్‌ఎస్‌డీ లాంటి వైరస్ సోకిన పశువులకు కిందిస్థాయి సిబ్బంది అందించే వైద్యం చాలక ఏకంగా మృత్యువాతపడుతున్నాయి.

అధికార పార్టీ నేతల అండదండలతో డిప్యుటేషన్లు...

పశువైద్యశాఖ అధికారులు అధికార పార్టీ నేతల అండదండలతో వారికి కావాల్సిన స్థానాలకు డిప్యుటేషన్లు వేయించుకుని విధులకు హాజరుకావడం లేదు. ఉదాహరణకు కురిచేడుకు చెందిన ఏడీ


ఏడీ గంటా నాగేశ్వరరావు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

గంటా నాగేశ్వరరావు హెచ్‌ఎం పాడు నుంచి డిప్యుటేషన్‌పై కురిచేడు మండలానికి వచ్చారు. ఇక్కడ ఏడీగా పనిచేస్తున్న అధికారి నెల్లూరుకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇక్కడకు డిప్యుటేషన్‌పై వచ్చిన వైద్యాధికారి రమేష్‌బాబు ప్రమోషన్‌పై ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ స్థానం ఇప్పటికీ ఖాళీగా ఉంది. అధికార పార్టీకి చెందిన దర్శి నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి తమ బంధువేనని చెప్పుకుంటూ డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారు. వారానికి ఒకటీరెండు సార్లు మాత్రమే వచ్చి ప్రతిరోజూ విధులు నిర్వర్తిస్తున్నట్లు సంతకాలు చేసుకుని వెళ్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఈ నియోజకవర్గంలో తమను ఏమీ చేయలేరని.. మీకు చేతనైంది చేసుకోండని సమాధానం చెబుతూ బెదిరిస్తున్నారు. తనకు అమరావతిలో సచివాలయం నుంచి మంచి పలుకుబడి ఉందంటూ తోటి అధికారులను, కింది స్థాయి ఉద్యోగులను కూడా భయపెడుతూ వస్తున్నారు. చివరకు పశువులకు వైద్యం అందక చనిపోతున్నా చలనం లేకుండా వ్యవహరిస్తున్నారు. పశువైద్యశాఖలో డిప్యుటేషన్లు రద్దుచేసి ఎక్కడికి బదిలీ అయిన అధికారి అక్కడే ఉండి విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పశువులకు వైద్యసేవలు అందవని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రులకు తీసుకొస్తేనే వైద్యం చేస్తామన్న ఏడీ...

ఎలాంటి క్లిష్ట పరిస్థితులలోనైనా పశువులను వాటి పోషకులు పశువైద్యశాలలకు తీసుకొస్తేనే వైద్యసేవలు అందిస్తామని కురిచేడు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ గంటా నాగేశ్వరరావు గత సోమవారం పొట్లపాడులో జరిగిన గ్రామసభలో జిల్లా జాయింట్ డైరెక్టర్ కే బేబీరాణి సమక్షంలోనే ప్రకటించారు. దీనిపై పశుపోషకులు సైతం ముక్కున వేలేసుకున్నారు. పశువులు వ్యాధి తీవ్రతతో లేవలేని పరిస్థితిలో ఉంటే వైద్యశాలలకు ఎలా తీసుకురావాలంటూ పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. కురిచేడు మండలంలో ఒకేఒక్క పశువైద్యశాల ఉంది. మండలంలోని 15 నివాలయాలు సుమారు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. అనారోగ్యంగా ఉన్న పశువును ఆటోలో తీసుకురావాలంటే ఆ పశుపోషకునికి చాలా కష్టంతో కూడుకున్న పని. ఆ విషయం తెలిసీ కూడా కఠినంగా ఏడీ స్థాయి అధికారి మాట్లాడటం వారి నిర్లక్ష్యపు పనితీరుకు నిదర్శనంగా ఉందని పశుపోషకులు మండిపడుతున్నారు.

వైద్యం చేయకుండా చేతివాటం చూపిస్తున్న కురిచేడు ఏడీ...

కురిచేడు ఏడీ గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం ఇచ్చే మందుల్లో కూడా కక్కుర్తి పడుతున్నారు. నట్టల నివారణ మందు బయట కొనుగోలు చేయాలంటే రూ.700 నుంచి రూ.800 వరకు ఉంటుంది. రైతులకు నట్టల నివారణ మందు ఇచ్చి కింది స్థాయి సిబ్బంది ద్వారా రవాణా చార్జీల పేరుతో రూ.100 వసూలు చేయిస్తున్నారు. వాస్తవానికి రవాణా చార్జీలను ప్రభుత్వమే ఇస్తోంది. ఆస్పత్రిలో పశువైద్యం చేసేందుకు కూడా వెళ్లకుండా పశుపోషకులకు మందులిచ్చి మీరే వైద్యం చేయించుకోండని పంపిస్తున్నారు. ఏడీ ఎప్పుడు ఆస్పత్రికి వస్తారో.. ఎప్పుడు వెళ్తారో కూడా ఎవరికీ తెలియదు. హెచ్‌ఎం పాడు నుంచి కురిచేడుకు డిప్యుటేషన్‌పై వచ్చిన ఈ అధికారి విజయవాడలో నివాసం ఉంటూ ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారంటే.. ఆయన పని తీరును ఇట్టే అర్థంచేసుకోవచ్చు. డాక్టర్ వచ్చారా లేదా అని రిజిష్టర్లు పరిశీలిస్తున్నారని తెలిసి అటెండెన్స్ రిజిష్టర్‌ను బీరువాలో పెట్టుకుని తాళం వేసుకుంటున్నారు. తాను వచ్చిన రోజు అన్నీ సంతకాలు పెట్టుకుని వెళ్తున్నారు. పొట్లపాడులో జరిగిన గ్రామసభలో పశుపోషకులు ఈ పశువైద్యుడిని ఎప్పుడూ చూడలేదని, ఎన్నిసార్లు ఆస్పత్రికి వెళ్లినా కిందిస్థాయి సిబ్బందే కనిపిస్తున్నారని, డాక్టర్ లేరని వెనుతిరిగి ఇంటికి వెళ్తున్నామని జేడీ బేబీరాణితో ఈ వైద్యుని సమక్షంలోనే చెప్పడం గమనార్హం.

రెండు ఇళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న దుస్తులు

పెద్దదోర్నాల: రెండు నివాస గృహాల్లో దుండగులు దొంగతనానికి పాల్పడిన సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని చిన్నదోర్నాలలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పసుపు చిన్న కోటేశ్వరరావు, పొదిలి అనంతరాయుడులకు చెందిన ఇళ్లలో రెండు ఉంగరాలు, మూడు జతల మాటీలు, రెండు వెండి ఉంగరాలు, ఒక జత కమ్మలను దొంగలు చోరీ చేశారు. చిన్నకోటేశ్వరరావు ఓ శుభకార్యం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లగా, ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నగలును దొంగలు అపహరించారు. అనంతరాయుడు ఇంట్లోనూ అదే విధంగా జరిగింది. శనివారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.


దొంగలు పగులగొట్టిన బీరువాలను పరిశీలిస్తున్న పోలీసులు

బ్రహ్మంగారి ఆలయంలో హుండీ చోరీ


పొలంలో దొంగలు వదిలేసి వెళ్లిన హుండీ

కురిచేడు: బ్రహ్మంగారి ఆలయంలో హుండీ చోరీ అయిన సంఘటన మండలంలోని గంగదొనకొండ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఆలయానికి ఉన్న కిటికీ అద్దాలు తొలగించి దొంగలు గుడిలోకి వెళ్లి హుండీ తీసుకుని దగ్గరలోని కంది చేలో పగలగొట్టారు. ఆలయంలోని దుప్పటిలో హుండీ పెట్టుకుని వెళ్లి అందులోని నగదు దోచుకుని హుండీని అక్కడే వదిలి వెళ్లారు. ప్రతి ఏడాది స్వామివారి ఆరాధనకు అవసరమైన డబ్బు తీసుకుని మిగతావి హుండీలోనే ఉంచుతామని, హుండీలో పెద్ద మొత్తంలో భక్తులు వేసిన కానుకలు ఉంటాయని గ్రామస్తుడు మేకల రమేష్ తెలిపాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

డీఆర్‌సీ సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలి


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వం నుంచి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని తెలిపేలా డీఆర్‌సీ సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న డీఆర్‌సీ సమావేశానికి సంబంధించి పలు శాఖల అధికారులతో స్థానిక ప్రకాశం భవనంలో శనివారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పలు నివేదికల గురించి దిశానిర్దేశం చేశారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, వాటి వివరాలకు సంబంధించిన నివేదికలు సిద్ధంగా ఉంచాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు, జల్‌జీవన్ మిషన్, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్, హౌసింగ్‌కు సంబంధించి బిల్లులు, కొత్త ప్రతిపాదనలతో కూడిన వివరాలను పొందుపరచాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఓబులేసు, సీపీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ దేవానందం, ప్రాజెక్టు ఎస్‌ఈ అబూత్ అలీం, ఇరిగేషన్ ఎస్‌ఈ వరలక్ష్మి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి గోపీచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, డీఎంహెచ్‌ఓ సురేష్, డీసీహెచ్‌ఎస్ సూరిబాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికార పార్టీ మెప్పు కోసం..


- టీడీపీ నేతలు అక్రమంగా లారీల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు
- అధికార పార్టీ వారు కాకుంటే కిలోల్లో అయినా వ్యత్యాసం చూపి 6ఏ కేసు నమోదు


రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

కురిచేడు: అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం అధికారులు తాపత్రయపడుతున్నారు. ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ.. టీడీపీ నాయకుల మొహాల్లో ఆనందం కోసమే తాము పనిచేస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. శనివారం కురిచేడు రేషన్ షాపులో అధికారులు నమోదు చేసిన కేసులను, నిత్యం టీడీపీ నేతలు అక్రమంగా లారీల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గమనిస్తే ఆ విషయం ఇట్టే అర్థమవుతోంది. కురిచేడు పడమరహరిజనవాడలోని రేషన్‌షాపు నంబర్12ను శనివారం అధికారులు తనిఖీ చేశారు. ఒంగోలు ఎన్‌ఫోర్సుమెంటు డీటీ రాజ్యలక్ష్మి, దర్శి ఎన్‌ఫోర్సుమెంటు డీటీ ప్రసన్న, ఆర్‌ఐ నాగరాజు, వీఆర్వో నాగరాజు తనిఖీ చేసి రేషన్ షాపులో బియ్యం 51 కిలోలు, జొన్నలు 2 కిలోలు, కందిపప్పు 21 కిలోలు, చక్కెర 68 ప్యాకెట్లు తేడా ఉన్నట్లు గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 12వ నంబర్ రేషన్‌షాపు నిర్వాహకులను రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. రాజీనామా చేయకపోవటంతో ఆకస్మిక తనిఖీలు, కేసులు అంటూ భయాందోళనకు గురిచేస్తున్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బియ్యం టిక్కీకి 5 కిలోల వరకు తగ్గించి ఇస్తున్నా కాటా వేయకుండా డీలర్లకు సరఫరా చేస్తున్నారు. టీడీపీ నేతలు బయట మార్కెట్‌కు అక్రమంగా లారీల కొద్దీ బియ్యం తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికార పార్టీకి సంబంధం లేని వారిని మాత్రం కేజీ తేడా ఉన్నా కేసులు నమోదు చేస్తున్నారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

టీడీపీ సర్పంచ్ దందా

- బిల్లుల నగదు కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా బెదిరింపులు


బ్యాంక్‌లో డబ్బులు జమైనట్లు అధికారులు శాంసన్‌కు ఇచ్చిన ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీ


కొండాయపాలెంలో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్

పొదిలి రూరల్: మండలంలో కొండాయపాలెం టీడీపీ సర్పంచ్ మాధవి, ఆమె భర్త అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. బిల్లుల నగదు కాంట్రాక్టర్‌కు చెల్లించకుండా స్వాహా చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. టీడీపీ అధికారంలో లేనప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరిస్తూ దందా చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొండాయపాలెంలో గ్రామ సచివాలయం భవనం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాలను కాంట్రాక్టర్ ద్వారా నిర్మించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, సలకనూతల గ్రామానికి చెందిన కాంట్రాక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు శాంసన్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ సెంటర్ భవనాన్ని దాదాపు రూ.21 లక్షలతో నిర్మించారు. సంబంధిత బిల్లులు సర్పంచ్, కార్యదర్శి జాయింట్ అకౌంట్లో జమవుతాయి. మొదటి బిల్లు కింద సర్పంచ్ అకౌంట్లో రూ.11 లక్షలు జమవగా, ఆ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఉండటంతో సర్పంచ్ వెంటనే డబ్బులు డ్రాచేసి కాంట్రాక్టర్‌కు ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సర్పంచ్ తీరు కూడా మారిపోయింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వర్క్ ఐడీ 087051209011090012 ఎంబీ నంబర్ 96–ఏ, పేజీ74 ప్రకారం హెల్త్‌క్లినిక్ సెంటర్ భవనానికి సంబంధించిన రెండో బిల్లు పొదిలి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో గత జూలై నెలలో జమైంది. కొండాయపాలెం పంచాయతీ జాయింట్ అకౌంట్ నంబర్ 91032154694లో రూ.3,15,442 లక్షలు జమయినప్పటికీ.. సర్పంచ్ భర్త సుబ్బారావు కాంట్రాక్టర్‌కు ఇవ్వకుండా స్వాహాచేసి ఫోన్ చేసినా ఎత్తడం లేదు. నేరుగా వెళ్లి డబ్బు ఇవ్వమని అడిగితే మాకు ఫోన్ చేయొద్దు, డబ్బు అడగొద్దంటూ తెగేసి చెబుతూ బెదిరిస్తున్నాడు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని శాంసన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఫిట్స్‌కు మాత్రలు మింగి మహిళ మృతి


మృతిచెందిన వీరనారాయణమ్మ

కొత్తపట్నం: ఫిట్స్‌కి మాత్రలు మింగి మహిళ ప్రాణాలు కోల్పోయిన సంఘటన కొత్తపట్నం మండలంలోని కె.పల్లెపాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కె.పల్లెపాలెం గ్రామానికి చెందిన నాయుడు వీరనారాయణమ్మ (32) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. పాకల గ్రామానికి చెందిన వీరనారాయణమ్మకు 15 సంవత్సరాల క్రితం కె.పల్లెపాలేనికి చెందిన నాయుడు రమేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పుడప్పుడూ ఫిట్స్ వచ్చి పడిపోతూ ఉంటుంది. ఫిట్స్‌కు మాత్రలు మింగుతూ ఉంటుంది. ఈ నెల 29వ తేదీ అధికంగా ఫిట్స్ మాత్రలు మింగింది. కొద్దిసేపటికే స్పృహతప్పి పడిపోయింది. అక్కడే ఉన్న బంధువులు ఒంగోలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్‌బాబు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి కన్నా వెంకటరెడ్డియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.